క్లుప్తంగా

మినీ బ్యాంక్ ప్రారంభం



నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ ఎస్‌బీఐ బ్యాంకుకు అనుబంధంగా అభంగాపూర్‌లో ఏర్పాటు చేశారు. మంగళవారం మాజీ ఎంపీపీ సదాశివరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు వ్యవప్రయాసల నుంచి ఉపశమనం కల్పించాడానికి స్థానికంగా మిని బ్యాంకు సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బ్రాంచిమేనేజర్ ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, ఓంప్రకాష్, రాములు, శ్రీను, నారాయణ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలి

మరికల్: మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని మండల అధ్యక్షుడు వీరన్న, జిల్లా నాయకులు సూర్యమోహన్ అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఈ నెల 16న కోయిల్‌కొండ మండలం నుంచి ప్రారంభమయ్యే బైక్‌ర్యాలీ మధ్యాహ్నం మండలానికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు హరీష్, రామకృష్ణ, ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, శేఖర్, మొగులప్ప, సత్యన్న పాల్గొన్నారు.

ఎస్ఐకి ఘన సన్మానం



మరికల్: ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ మురళిని మంగళవారం రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు కుర్మయ్య, తిరుపతయ్య, శ్రీనివాస్‌లు ఎస్ఐని సన్మానించిన అనంతరం పాకిస్తాన్, చైనా సరిహద్దులో వారు చేసిన విధులను గుర్తుచేసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాగనూర్: మండలంలోని కొల్పూర్‌లో తెల్లవారుజామున అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ ఎండీ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. నమ్మదగిన వారు ఇచ్చిన సమాచారం మేరకు డయల్ 100 సిబ్బంది రాజశేఖర్, కృష్ణాప్రసాద్ అడవిసత్యారం వాగునుంచి కొల్పూర్‌కు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించి ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యాజమానిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

కృష్ణా: మండలంలోని కుస్నీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సురేందర్‌కు మండల కేంద్రంలోని జ్ఞాన సంఘం పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ మేరకు.. హెచ్ఎం అశ్విని మాట్లాడుతూ.. 2024 సర్వేపల్లి రాధకృష్ణాన్ జాతీయ అవార్డు మండలంలోని కుస్నీ పాఠశాల ఉపాధ్యాయుడికి రావడం హర్షించదగ్గ విషయమన్నారు. తన వృత్తిలో కనబరిచిన నిబద్ధతతోనే ఉత్తమ అవార్డు వరించిందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీ నరేందర్, సీఆర్‌పీ అమీన్‌రెడ్డి, తాయప్ప టీచర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శంకరానంద మహాస్వామి ఉత్సవాలు

కృష్ణా: మండంలోని హిందూపూర్‌లో బుధవారం నుంచి శంకరానంద సరస్వతి మహాస్వామి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆ మఠం సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం కాకడ హారతి, ధ్వజారోహణ, మధ్యాహ్నం గీతాపారాయణం, సాయంత్రం ప్రభోత్సవం ఉంటుందన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

కృష్ణా: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతోపాటు అభివృద్ధికి కావాల్సిన అంతర్గత రోడ్లు నిర్మాణం, తాగునీరు, డ్రైయినేజీ నిర్మాణం తదితర అంశాలను ముందుగా చేపడుతున్నట్లు ఎంపీటీసీ సభ్యుడు మ్యాకలి రాంచందర్, కుస్నీ కాంగ్రెస్ అధ్యక్షుడు పట్వారి సిద్దప్ప అన్నారు. మంగళవారం గ్రామంలో రూ. 10లక్షలతో 260 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణాన్ని వారు ప్రారంభించారు. నల్లె నర్సప్ప, ప్రభుగౌడ్, సుదర్శన్, శ్రీనివాసులు, నారాయణ, శరణప్ప, శివ, సురేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నారాయణపేట: ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జరిగిన ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్ష జరిగింది. జిల్లావ్యాప్తంగా 3541 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 3455 మంది హాజరు కాగా 85 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అదేవిధంగా 548 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 530 మంది పరీక్ష రాయగా 18 మంది గైర్హాజరయ్యారు. జిల్లా తనిఖీ బృందం అధికారులు మక్తల్, ధన్వాడ, పేట, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం మక్తల్ మాగనూర్, సిట్టింగ్ స్క్వాడ్ మద్దూర్, మరికల్ కేంద్రాలు పరిశీలించారు.

వట్టిపోయిన భీమానది

- సాగునీళ్లు లేక నెర్రలు చాస్తున్న వరిపొలాలు
- పంటను పశువులకు వదిలేస్తున్న రైతులు



నదీ తీరంలో నీళ్లు లేక నెర్రలుబారిన వరిపొలం



నీళ్లు లేక వట్టిపోయిన భీమానది

కృష్ణా: మండలంలోని భీమానది పూర్తిగా వట్టిపోయింది. దాదాపు మూడు కిలోమీటర్లు ప్రవహించి, కృష్ణాలో కలిసే భీమానది.. చుక్కనీరు లేక కళావిహీనంగా మారింది. దీంతో నదీతీర ప్రాంతంలో సాగుచేసిన వరిపొలాలు ఎండిపోయి నెర్రలు బారుతున్నాయి. మరో నెలరోజుల్లో చేతికొచ్చే పంటను కాపాడుకోలేక రైతులు పశువులకు వదిలేస్తున్నారు. రోజుకో రైతు పంటను పశువులకు వదిలేస్తూ, మనోవేదనకు గురవుతున్నారు. భీమానది పూర్తిగా ఎండిపోవడంతో మూగజీవాలకు తాగునీరు దొరకని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. నది ఎగువన ఉన్న కర్ణాటకలోని గూడూర్, యాద్గీర్ బ్రిడ్జికం బ్యారేజీల్లో నీళ్లు ఉన్నా.. దిగువకు విడుదల చేయకపోవడంపై ఇక్కడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాగునీటి అవసరాల కోసమైనా నీటిని విడుదల చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

80 ఎకరాల్లో ఎండిన వరి..

భీమా నదీతీరంలో ఇప్పటికే దాదాపు 80 ఎకరాల్లో వరిపంట ఎండిపోయింది. కుసుమర్తి గ్రామస్తులకు చెందిన 50 ఎకరాల పొలాన్ని ఆంధ్రాకు చెందిన నరేష్ అనే వ్యక్తి కౌలుకు తీసుకుని, వరిసాగు చేయగా.. నీళ్ల లేక పూర్తిగా ఎండిపోయింది. అదేవిధంగా బడిగేరి బస్వరాజ్‌కు చెందిన మూడెకరాలు, కుర్వ లక్ష్మణ్ణకు చెందిన 8 ఎకరాల్లో పంట ఎండిపోవడంతో పశువులకు వదిలేశారు.

నీళ్లులేక ఎండిపోయింది..



ప్రస్తుతం వరికి ధరలు బాగున్నాయని 3 ఎకరాల్లో పంట సాగు చేశాను. తీరా భీమానదిలో నీళ్ల లేకపోవడంతో వరిపొలం మొత్తం ఎండిపోయింది. పంటకు పెట్టిన పెట్టుబడి కూడా అప్పుగా మారింది.

– బడిగెరి బస్వరాజ్, కుసుమర్తి గ్రామం

నీటిని విడుదల చేయించాలని విజ్ఞప్తి

కృష్ణా: మండలంలోని సూకూర్ లింగంపల్లి, తంగిడి, ఐనాపూర్, కుసుమర్తి గ్రామాలకు చెందిన దాదాపు 200మంది రైతులు తమ పంటలను కాపాడేందుకు భీమా నదికి నీటిని విడుదల చేయించాలని బుధవారం ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతోపాటు భారీనీటి పా రుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ప్రత్యేకంగా కలిసి విజ్ఞప్తి చేస్తున్నట్లు మంగళవా రం మండల రైతు సంఘం నాయకుడు గంటి శరణబసవ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంగెబండకు వస్తున్న మంత్రులను ఐదు గ్రామాలకు చెందిన రైతులతో కలిసి తాము కర్ణాటక నుంచి నీటిని విడుదల చేయించి పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి చెన్నబసవేశ్వరస్వామి ఉత్సవాలు



చెన్న బసవేశ్వరస్వామి మూలవిరాట్



చెన్న బసవేశ్వరస్వామి ఆలయం

మక్తల్: పవిత్ర కృష్ణానది ఒడ్డున వెలసిన శ్రీచెన్నబసవేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ప్రభోత్సవం, గురువారం సాయంత్రం 4.35 గంటలకు రథోత్సవం, శుక్రవారం పల్లకీసేవ, శనివారం స్వామివారి తోట్ల కార్యక్రమం అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామివారి ఉత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున రానున్నారు. ఇందుకోసం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఆడపిల్లల సంరక్షణకు కృషిచేద్దాం



కొల్లంపల్లిలో అవగాహన సదస్సు వక్తలు

నారాయణపేట రూరల్ : ఆడపిల్లలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని వక్తలు అన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో–బేటీ పడావో పథకం ప్రచారంలో భాగంగా మంగళవారం కొల్లంపల్లిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. రోజురోజుకు అమ్మాయిల శాతం తగ్గుతుందని, భవిష్యత్‌లో ప్రమాదం జరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో నర్సింహ, అస్వియాబేగం, ఖాజాబి, అప్సర్ పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలోని మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు.. రేణుక మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆడపిల్లలను మధ్యలోనే చదువు మానించొద్దన్నారు. గ్రామాల్లో ఎక్కడైన బాల్యవివాహాలు చేస్తే ఫోన్ నంబర్ 1098కు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో రేణుక, సాధిక, అమీనాబేగం, సోఫియా, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న విండో చైర్మన్

మరికల్: మండలంలోని అప్పంపల్లిలో ఎన్ఆర్‌జీఎస్ పథకం కింద చేపట్టిన సీసీరోడ్డు పనులను మంగళవారం సింగిల్ విండో చైర్మన్ వెంకట్రామారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే గ్రామాలు అభివృద్ధి చెందయన్నారు. గ్రామంలో చేపట్టిన సీసీరోడ్డు పనులు నాణ్యతగా చేయిస్తామన్నారు. పేదలకోసం సీఎం రేవంత్ అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలు అర్హులకు అందించే బాధ్యత తమపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు సూర్యమోహన్, వీరన్న, వెంకట్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, దామోదర్‌రెడ్డి, రాజు, నారంరెడ్డి పాల్గొన్నారు.

ధరణి సమస్యల పరిష్కారానికి చర్యలు



బాధితుడి వివరాలు సరిచేస్తున్న తహసీల్దార్

కోస్గి: ప్రభుత్వం ధరణిలో కొన్ని సమస్యలను పరిష్కరించే బాధ్యత తహసీల్దార్‌లకు ఇవ్వడంతో మంగళవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాసులు ఓ బాధితుడి సమస్యను తక్షణమే పరిష్కరించారు. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన రాంచందర్ భూమి పట్టాదార్ పాస్‌బుక్‌లో ఎస్సీ కులానికి బదులు బీసీ–డీగా కులం తప్పుగా నమోదైంది. కులం మార్పుకోసం దరఖాస్తు చేసుకొని పలుమార్లు అధికారుల చుట్టు తిరిగాడు. ఈ క్రమంలో ప్రభుత్వం కొన్ని ధరణికి సంబంధించిన అధికారాలను తహసీల్దార్లకు బదలాయించిన నేపథ్యంలో మంగళవారం ఆర్ఐతో క్షేత్రస్థాయిలో పంచనామ నిర్వహించారు. ఆర్ఐ నివేదిక ఆధారంగా ఆన్‌లైన్‌లో బాధితుడి కులం మార్పుచేసి అప్పటికప్పుడు ధృవీకరణ పత్రం అందజేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 7రోజుల వ్యవధిలో ధరణి సమస్యను పరిష్కరించాల్సి ఉంటుందని, పంచనామ నిర్వహించి బాధితుడి సమస్యను పరిష్కరించామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ

ధన్వాడ: రామ్ రహీం ఫ్రెండ్స్, 2005–06 పదోతరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు ఉచితంగా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులు పదిలో ఉత్తమ మార్కులు సాధించాలని హెచ్ఎం రమేష్‌శెట్టి అన్నారు. కార్యక్రమంలో ఇర్ఫాన్, నవీన్, శ్రీనివాసులు, ఖలీల్, నవీన్, బన్ని, భాను, ప్రకాష్‌రెడ్డి, మోనేష్‌చారి, వెంకటేష్ పాల్గొన్నారు.

డిమాండ్ నోటీస్ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

నర్వ: బీడీ పరిశ్రమపై ఆధారపడ్డ ప్రతి కార్మికుడు డిమాండ్ నోటీస్ అందించే సభకు తరలిరావాలని ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల బ్రాంచీల వద్ద బీడీ కార్మికులనుద్దేశించి మాట్లాడారు.. వివిధ రకాల కార్మికులు రోజు కూలీకి పోయి రూ. 400నుంచి రూ.800 వరకు సంపాదిస్తున్న బీడీ కార్మికులు మాత్రం వెయ్యి బీడీకి రూ. 207 మాత్రమే యాజమాన్యం చెల్లించి శ్రమ దోపిడి చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 16న చిన్నచింతకుంటలో బీడీ పరిశ్రమ ప్రధాన కేంద్రం వద్ద నిర్వహించే డిమాండ్ నోటీస్ అందించే కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మన్నెం, తిరుపతమ్మ, లక్ష్మీ, నాగేష్, వెంకటమ్మ, యేసు, మరియమ్మ, బాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప సభకు తరలిన నాయకులు



నారాయణపేటలో జెండాఊపి వాహన శ్రేణిని ప్రారంభిస్తున్న రతంగపాండురెడ్డి

నారాయణపేట రూరల్ : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన విజయ సంకల్పయాత్రకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు తరలివెళ్లారు. దాదాపు ఏడువందల పోలింగ్‌బూత్‌లు, వివిధ మండలాలు, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా, రాష్ట్ర బాధ్యులతో కలిసి ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. ఈ మేరకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్తకాపు రతంగ పాండురెడ్డి జెండా ఊపి వాహనశ్రేణిని ప్రారంభించారు. బీజేపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీ.శ్రీనివాసులు, రఘురామయ్యాగౌడ్, సాయిబన్న, గణపశ్రీనివాస్, ప్రభాకర్, నర్సింహులు పాల్గొన్నారు.

నర్వ: హైదరాబాద్‌లోని ఎల్‌బీస్టేడియంలో నిర్వహించిన విజయసంకల్ప సభకు మంగళవారం బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక వాహనాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర బూత్ కమిటీల విజయసంకల్ప సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలతో కలిసి వెళ్తున్నామన్నారు. నాయకులు రవికుమార్‌రెడ్డి, అయ్యన్న, శశిదర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్ తదితరులు ఉన్నారు.

మద్దూరు: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో బీజేపీ నిర్వహించిన విజయ సంకల్ప మహా సమ్మేళనానికి మండల బీజేపీ నాయకులు మంగళవారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ దేశ వ్యాప్తంగా 400 పైగా ఎంపీ స్థానాలు గెలుస్తుందని, పాలమూరు ఎంపీ స్థానం కూడా బీజేపీ కైవశం చేసుకుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, రవి, సాయిలు, గుండప్ప, కన్నప్ప, రాఘవేంద్రచారి, శ్రీనివాస్, తదితరులు తరలి వెళ్లారు.

ధన్వాడ: విజయ సంకల్ప యాత్రకు మండలం నుంచి బీజేపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విజయ సంకల్పయాత్రకు మండలం నుంచి దాదాపు 200మంది కార్యకర్తలు ప్రత్యేక బస్సులో తరలివెళ్లారు. కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ ఉమేష్, ఉదయభాను, విజయ్‌కుమార్, వెంకట్రాములు ఉన్నారు.

అడవిసత్యారంను సందర్శించిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

మాగనూర్: వేసవికి ముందే మండలంలో తాగునీటి సమస్య నెలకొందని మంగళవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన వార్తకు సంబంధిత మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో నీటి సమస్యపై ఆరా తీశారు. గ్రామ సమీపంలో వాగు ఉండటంతో గతంలో మిషన్‌భగీరథ నీటిని వాడుకోలేదని దీంతో గ్రామంలోని కొళాయి మొత్తం నిరూపయోగంగా మారాయన్నారు. వెంటనే వాటిని మరమ్మతులు చేయించి తాగునీటి సమస్య పరిష్కారిస్తామని తెలిపారు. మిషన్ భగీరథ ఏఈ వినోద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోర్టులో ఖాళీ పోస్టులను భర్తీచేయండి



నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని కోర్టులో ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీచేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టు జడ్జి విజయభాస్కర్‌రెడ్డిని కలిసి మంగళవారం వినతిపత్రం అందించారు. అనంతరం కోర్టుకు సంబంధించిన అన్ని వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, నందునామాజీ, చెన్నారెడ్డి, సలీం, మల్లికార్జున్, రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన సీఐ



నారాయణపేట: పేట సీఐగా బి.శివశంకర్ బాధ్యతలు తీసుకున్న తర్వాత మంగళవారం ఎస్పీ యోగేష్ గౌతమ్‌ను ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. సర్కిల్ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలు పరిరక్షించాలని సీఐకి ఎస్పీ సూచించారు.

సీటు కావాలనుకుంటే.. బ్యాగు పోయింది..

నారాయణపేట: ఆర్టీసీ బస్సులో రద్దీ కారణంగా సీటు కోసం కిటికిలో నుంచి బ్యాగు వేస్తే చోరీకి జరిగిన సంఘటన చోటుచేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. మాగనూర్ మండలం నేరేడ్‌గామ్‌కి చెందిన కవిత పట్టణంలోని చైల్డ్ ప్రొటెక్షన్ కార్యాలయంలో జిల్లా లీగల్ అధికారిణిగా విధులు నిర్వహిస్తుంది. మంగళవారం డ్యూటీ పూర్తి చేసుకుని తిరిగి సొంత గ్రామానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చింది. ఈ క్రమంలో గంటపాటు వేచి చూడగా బస్సు వచ్చింది. ఎక్కువ రద్దీగా ఉండటంతో బస్సు కిటికిలో నుంచి సీటు కోసం తన హ్యాండ్‌బ్యాగును ఉంచింది. బస్సు ఎక్కి చూడగా బ్యాగు కనిపించలేదు. వెంటనే ఆర్టీసీ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించి రాతపూర్వకంగా ఫిర్యాదు ఇచ్చారు. బ్యాగులో రూ.30 వేల నగదుతో పాటు ఏటీఎం, పాన్‌కార్డులు ఉన్నాయని తెలిపింది. అయితే జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో సీసీ కెమెరాల నిర్వహణ లేకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

కరపత్రం విడుదల

మద్దూరు: ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల 25న కొడంగల్‌లో చేపట్టే జిల్లా సదస్సు కరపత్రాన్ని మంగళవారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాలతో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న, అశోక్ ఇతర నాయకులతో కలిసి కరపత్రాన్ని విడుదల చేశారు. పేట– వికారాబాద్ జిల్లాల సదస్సును ఈ నెల 25న కొడంగల్‌లో చేపట్టనున్నట్లు అప్పటివరకే రెండు జిల్లాల పరిధిలోని గ్రామాల కమిటీలు, మండలాల కమిటీ పూర్తిచేసుకొని సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్, నాయకులు కృష్ణ, ప్రవీణ్, పొన్నయ్య, ఏకే.రాము, నరేష్, హన్మంతు, చిన్నయ్య, కేశవులు, భాస్కర్, లక్ష్మయ్య, రాజు, భీమప్ప, లాలప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



కోస్గిలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్ : పట్టణంలోని మంగళవారం శ్రీసాయి స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులై స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చక్కటి విద్యాబోధన చేసిన వారికి యాజమాన్య సభ్యులు హాజరై బహుమతులు అందించారు. కార్యక్రమంలో నిర్వహకులు శేషమ్మ, గోపాల్‌రెడ్డి, కవిత, సురేందర్, బాలప్ప, నర్సింహ పాల్గొన్నారు.

కోస్గి: మండల పరిధిలోని ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఇన్‌చార్జి హెచ్ఎం పుల్లప్ప మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని బుడ్డమర్రితండా ప్రభుత్వ ఎంపీపీఎస్ పాఠశాలలో మంగళవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాము, ఉపాధ్యాయులు శ్రుతి పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకే ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కృష్ణా: మండల కేంద్రంతోపాటు హిందుపూర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నవీద్ మాట్లాడుతూ ఏస్పీ ఆదేశాల మేరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు, వచ్చే పార్లమెంట్ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రజలు భయ పడకుండగా నిర్భయంగా తమ హక్కులను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, స్థానిక పోలీసులతో పాటూ కేంద్ర సాయుధ బలగాలు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నర్వ: పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహర్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్ఐ కురుమయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రతిభ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.. ఆయా గ్రామాల ప్రజలు తాగునీటికోసం ఇబ్బందులు పడకుండా చలివేంద్రాన్ని ఏర్పాటుచేసిన ప్రతిభా పాఠశాల హన్మంత్‌రెడ్డిని అభినందించారు. రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

మాగనూర్: ఉచిత పశువైద్య శిబిరాలను కాపరులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక అధికారి డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండల పరిధిలో నేరడగం, నేరడగందొడ్డి గ్రామాల్లో కొనసాగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల పశువుల కాపరులు తమ జీవాలకు విధిగా టీకాలు వేయించాలన్నారు. పశువుల్లో గర్భకోశ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వినయ్‌కుమార్, యశోద పాల్గొన్నారు.